# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-06-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. భారత రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలు తమ అచంచలమైన విశ్వాసాన్ని మరోసారి ప్రకటించారని.. అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో అరకు కాఫీ గొప్ప రుచికి, సువాసనకు ప్రసిద్ధి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు.**

**3. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి 40 శాతం ప్రమాద భత్యాన్ని ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.**

**4. పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ జలవనరుల నిపుణులు ఈరోజు పరిశీలించారు.**

5. **విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రేపటి నుంచి కార్గో సేవలు పునఃప్రారంభం కానున్నాయి.**

==========================

భారత రాజ్యాంగం పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలు తమ అచంచలమైన విశ్వాసాన్ని మరోసారి ప్రకటించారని.. అందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే మన్ కీ బాత్ కార్యక్రమం 111వ సంచిక ఈరోజు ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమైంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరిగిన ఈ తొలి మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి వివిధ అంశాలపై ప్రజలతో సంభాషించారు. ఈ ఏడాది 2024లో జరిగిన ఎన్నికలు ప్రపంచంలోనే అతి పెద్ద ఎన్నికలని... ఈ ఎన్నికల్లో 65 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రధాని తెలిపారు. ఇందుకోసం ఎన్నికల సంఘాన్ని, ఓటింగు ప్రక్రియతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తున్నట్లు చెప్పారు.

--------------------------

ఈ సంవత్సరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమ్మ పేరుపై ఒక చెట్టు పేరుతో ప్రత్యేక ఉద్యమాన్ని ప్రారంభించామని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ప్రజలు తమ తల్లితో కలిసి చెట్లను నాటుతున్న చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటున్నారని వెల్లడించారు. గత దశాబ్దంలో అందరి కృషి కారణంగా భారతదేశంలో అటవీ విస్తీర్ణం అపూర్వ రీతిలో పెరిగిందని.. అమృత మహోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా

60 వేలకు పైగా అమృత సరోవరాలను నిర్మించామని ప్రధాని పేర్కొంటూ...

...వాయిస్...

---------------------------

దేశంలోని వివిధ ప్రాంతాలకు రుతుపవనాలు వేగంగా విస్తరిస్తున్నాయని.. ఈ సందర్భంగా కేరళలోని అట్టాపడిలో తయారుచేసే 'కార్థుంబీ గొడుగుల గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. భారతదేశానికి చెందిన అనేక ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా చాలా డిమాండ్ ఉందని.. అటువంటి ఒక ఉత్పత్తి అరకు కాఫీ అని ప్రధాని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతా రామరాజు జిల్లాలో అరకు కాఫీ భారీ స్థాయిలో ఉత్పత్తి అవుతుందని.. ఇది గొప్ప రుచికి, సువాసనకు ప్రసిద్ధి అని చెప్పారు. అరకు కాఫీ ఖ్యాతి కొత్త శిఖరాలకు చేరడంలో గిరిజన సహకార సంఘం ప్రధాన పాత్ర పోషించిందని వెల్లడించారు. ఒకసారి విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు ఈ కాఫీని రుచి చూసే అవకాశం తనకు లభించిందని గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలో జరిగిన జి-20 శిఖరాగ్ర సమావేశంలోనూ కాఫీ మాధుర్యాన్ని అతిథులు రుచి చూశారని తెలిపారు.

..వాయిస్...

---------------------------

వచ్చే నెలలో ఈ సమయానికి ప్యారిస్ ఒలింపిక్స్ ప్రారంభమవుతాయని... ఒలింపిక్ క్రీడల్లో పాల్గొంటున్న భారత జట్టుకు ప్రధాని శుభాకాంక్షలు తెలియజేశారు. కొన్ని నెలల కిందట జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో మన క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చూపారని గుర్తు చేసుకున్నారు. ఈ నెల యావత్ ప్రపంచం 10వ యోగా దినోత్సవాన్ని ఎంతో ఆనందోత్సాహాలతో జరుపుకుందని ప్రధాని పేర్కొన్నారు. సౌదీ అరేబియాలో మొదటిసారిగా ఒక మహిళ అల్ హనౌఫ్ సాద్ ఉమ్మడి యోగా సాధన కార్యక్రమానికి నాయకత్వం వహించారని.. ఒక సౌదీ మహిళ యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఇదే మొదటిసారని అని పేర్కొన్నారు. ఈసారి యోగా దినోత్సవం సందర్భంగా ఈజిప్టులో ఫొటోల పోటీ నిర్వహించారని వెల్లడించారు. యోగా దినోత్సవంలో పాల్గొన్నవారందరికీ ప్రధాని కృతజ్ఞతలు తెలియజేశారు.

---------------------------

ఆకాశవాణి సంస్కృత బులెటిన్ ప్రసారం ప్రారంభమై ఈరోజుతో 50 సంవత్సరాలు పూర్తవుతోంది. ఈ సందర్భంగా ఆకాశవాణి కుటుంబాన్ని ప్రధాని అభినందించారు. సంస్కృతాన్ని మన దైనందిన జీవితంతో అనుసంధానించడం నేటి కాలానికి అవసరమని... ప్రస్తుతం బెంగళూరులో చాలా మంది ఇలాంటి ప్రయత్నం చేస్తున్నారని వెల్లడించారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాగు చేస్తున్న అరకు కాఫీ ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. గిరిజనులు సాగు చేసే అటవీ ఉత్పత్తుల్లో ఇదొకటి. ప్రపంచ పేరు గాంచిన అరకు కాఫీని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించడంపై గిరిజన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు మాట్లాడుతూ...

...వాయిస్...

---------------------------

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం ఎన్డీఆర్ఎఫ్ చేపట్టే కీలకమైన ఆపరేషన్లను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి 40 శాతం ప్రమాద భత్యాన్ని ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిన్న వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని 21 వేల 625 అడుగుల ఎత్తయిన మణిరంగ్ పర్వతాన్ని ఇటీవల అధిరోహించిన 35 మంది సభ్యుల ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని స్వాగతిస్తూ ఆయన మాట్లాడారు. ప్రమాద భత్యాన్ని పెంచడం ద్వారా దళానికి చెందిన 16 వేల మంది సిబ్బందికి లబ్ధి చేకూరనుందని తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలతోపాటు ఎన్డీఆర్ఎఫ్ వంటి సంస్థల్లో క్రీడల సంస్కృతిని తీసుకురావాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఈ బలగాల నుంచి కనీసం ఒక బృందం తప్పనిసరిగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలని అమిత్ షా చెప్పారు.

---------------------------

పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ జలవనరుల నిపుణులు ఈరోజు పరిశీలించారు. అమెరికా, కెనడా నుంచి వచ్చిన నలుగురు నిపుణులు ఈరోజు ఉదయం ప్రాజెక్టు వద్దకు చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అమెరికా నుంచి డేవిడ్ పి పాల్, గెయిన్ ఫ్రాంకో డి సిక్కో, కెనడా నుంచి రిచర్డ్ డానెల్లీ, సీన్ హించ్ బెర్గర్ హాజరయ్యారు. నేటి నుంచి జులై 3వ తేదీ వరకు ప్రాజెక్టు సైట్‌లో పనులను నిపుణులు పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థలతో కలిసి సమీక్ష నిర్వహించనున్నారు.

---------------------------

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రేపటి నుంచి కార్గో సేవలు పునఃప్రారంభం కానున్నాయి. కార్గో సర్వీసుకు 2021లో ముందడుగు పడినప్పటికీ కరోనా కారణంగా నిలిచిపోయాయి. తాజాగా కార్గో సేవల పునరుద్ధరణకు పిలిచిన టెండర్‌ను ఒమేగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ దక్కించుకుంది. విమానాశ్రయ డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రం నుంచి ఆక్వా ఉత్పత్తులైన చేప, రొయ్యలతోపాటు పూలు, పండ్లు, మిర్చి, తదితర ఉత్పత్తులను దేశంలోని ఏ ప్రాంతానికైనా గంటల వ్యవధిలో చేర్చేందుకు కార్గో సర్వీసు దోహదపడుతుందన్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ సర్వీసు నడిపేందుకు కస్టమ్స్ అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడి చాతుర్యం, వాగ్ధాటి ముందు ఎవరూ నిలువలేరని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 75వ పుట్టినరోజు సందర్భంగా ఆయన జీవిత ప్రస్థానంపై ప్రచురించిన మూడు పుస్తకాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు దృశ్య మాధ్యమం ద్వారా విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ వెంకయ్యనాయుడి జీవితంపై రచించిన ఈ పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి వచ్చి వెంకయ్య నాయుడు ఉన్నత స్థానానికి ఎదిగారని ప్రధాని కొనియాడారు.

====================